# మార్పు కావాలా?

## ముద్దంశెట్టి హనుమంతరావు

అరుణ చాలా అమాయకురాలు.

ఆమె అమాయకత్వానికి తగ్గట్టుగా మంచి మనస్సామెది. అందుకే, ఒకరి గురించి 'చెడు' అనుకోవడంగాని, ఒకరి వెనుక 'చెడు' చెప్పడం గాని, ఆమెకి అలవాటులేదు.

నిరంతరం సన్నని చిరునవ్వు చిందిస్తూ, యెదుటివారిని పలకరిస్తుంది. ఆమె చిరునవ్వు, ఆమె మనసుకి అద్దం పట్టినట్టుగా స్వచ్ఛంగా వుంటుంది.

అయితేనేం? ఆమె మంచితనం, అమాయకత్వం, మెట్టినింట్లో మెప్పును పొందలేక పోయాయి. అదే ఆమె అనుక్షణం మానసికంగా అనుభవిస్తోన్న ఆవేదన! అదే ఆమె బాధ!

* * *

అరుణ అత్తగారు కామాక్షమ్మ, ముందు గదిలో కూచుని, చాలా రోజుల తర్వాత కనిపించిన స్నేహితురాలు కామేశ్వరమ్మతో లోకాభిరామాయణం మాట్లాడుతోంది. ఇద్దరాడవాళ్ళు మాట్లాడ్డానికి కూచున్నారంటే, వాళ్ళకి పొద్దే తెలీదంటారు పెద్దలు. "అరుణా..." కేక వేసింది, కామాక్షమ్మ.

అరుణ మెరుపులా వచ్చింది.

"ఏమిటత్తమ్మగారూ?" సవినయంగా అడిగింది.

"మా యిద్దరికీ కాస్త కాఫీ పెట్టి యివ్వమ్మా..."

"అప్పుడే పెట్టేశాను అత్తమ్మగారూ..." చప్పున జవాబు చెప్పింది, అరుణ.

"అయ్యాక తీసుకురా..."

అరుణ, లోపలికి పోయింది. కామేశ్వరమ్మ యేదో అనబోతూ వుండటం విని, చప్పున లోపల గదిలోనే ఆగిపోయింది, అరుణ.

"మీ కోడలు చాలా చురుకైన అమ్మాయి లానే వుందే కామాక్షీ! నువ్వు చెప్పకుండానే కాఫీ పెట్టేసింది చూశావా?" అంటూ ఓ చిన్న కాంప్లిమెంటు విసిరింది, కామేశ్వరమ్మ.

కోడల్ని మెచ్చుకుంటే, అత్త ఆనందిస్తుందా యెక్కడయినా? అలా ఆనందించే వాళ్ళు, ఆనందంతో గర్వించేవాళ్ళు, యే కొద్ది మందో వుంటారు. ఆ కొద్దిమందిలో కామాక్షమ్మని మాత్రం చెప్పకోలేం.

"ఆఁ... యేం చురుకోలెద్దూ! ఈ రోజు గామోసు, ఆ మొద్దు మొహానికి అపాటి యింగితం తెలిసింది? ఎప్పుడూ మంటిబుక్కడంలా కూచుంటే సరిపోతుంది..." అంది కామాక్షమ్మ, అసంతుష్టిగా.

సర్వసాధారణమైన అత్తలానే ప్రవర్తించింది, కామాక్షమ్మ. అయితే కామేశ్వరమ్మకి, ఆమె మాటలు అంతగా రుచించలేదు.

"నువ్వలా అనుకుంటున్నావుగాని కామాక్షీ, యిటువంటి వుత్తమురాలు కోడలుగా లభించడం, నిజంగా నీ అదృష్టమే అనుకో. నువ్వు దూరంగా ఆలోచించడంలేదు. ఈ రోజుల్లో కోడళ్ళు యెలా వుంటున్నారో చూస్తున్నాం కదూ?... పెళ్ళయిన కొద్దిరోజులకే వేరే కాపురాలు పెట్టించేస్తున్నారు..." అందామె.

కామాక్షమ్మ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"ఏం వుత్తమురాలో యేమిటోలే కామేశ్వరీ! ఇలా ముభావంగా, సోమరిలా వుంటే, మావాడికి అసలు నచ్చదు. పెళ్ళాం హుషారుగా, చలాకీగా వుండాలంటాడు."

"మంచిదానివేనే కామాక్షీ! నాగరికత వెర్రితలలు వేస్తూ, మనల్ని పెడత్రోవ పట్టిస్తోంది తప్పించి, సంసారపక్షంగా వుండటం, స్త్రీకి యెంతో శ్రేయస్కరం... ఆడదానికి అణకువ ఆభరణంలాంటి దంటారు..."

"అదంతా ఛాందసుల మనస్తత్వం..."

"అలా అనుకోవడమే పొరపాటు. ఆచారాల్ని మార్చేస్తున్నాంగాని, స్వతస్సిద్ధమైన మనోభావాల్ని మార్చగలమా చెప్పు? 'మార్చగలం' అని అనుకుంటే, అది వట్టి భ్రమ అంటాన్నేను" అంది కామేశ్వరమ్మ.

అంతవరకూ ఆ సంభాషణ వింది, అరుణ. కాఫీ పొంగిపోతోన్న శబ్దం కావడంతో, చరచరా వంటగదికేసి వెళ్ళిపోయింది.

ఆ క్షణం నించీ, ఆమె మెదడులో యెన్నో ఆలోచనలు. ఏవో సంఘర్షణలు !!

కాఫీ తీసుకొచ్చి, అత్తమ్మకి ఆమె స్నేహితురాలికీ అందించింది, అరుణ.

"కాఫీ అద్భుతంగా వుందమ్మా అరుణా" అంది కామేశ్వరమ్మ.

ఆమె మెచ్చుకోలు, అంతగా నచ్చలేదు కామాక్షమ్మకి. తన సమక్షంలో తన కోడల్ని యెవరైనా పొగిడితే, సహించలేని వికృత మనస్తత్వం ఆమెది. ఇల్లాంటి ప్రత్యేకమైన అత్తలు కొందరుంటారు మరి.

"ఆఁ... యేదోలే...... ఇవ్వాళగామోసు కాఫీ, కాఫీలా వుంది. లేకుంటే, రోజూ పానకం తాగినట్టే వుంటుందనుకో!" మొహం ముడుచుకుంటూ చెప్పింది, కామాక్షమ్మ.

కామాక్షమ్మ మనస్తత్వాన్ని యిట్టే గ్రహించింది, కామేశ్వరమ్మ. అంచేత యేమీ అనకండా మౌనం దాల్చింది.

అరుణకి, వొళ్ళు మండిపోయింది. కోడలుగా ఆ ఇంట్లో అడుగు పెట్టింతర్వాత, ఆమెకి కోపం రావడం, యిదే మొదటిసారి. తనని అత్తమ్మ ఎందుకలా కించపరుస్తూ వుంటుందో ఒకపట్టాన అవగాహన కాలేదామెకి. అయినా, వస్తోన్న కోపాన్ని బలవంతంగా అణుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు నించీ అరుణలో అనుకోకండా ఓ విధమైన మార్పు వచ్చింది. తన మంచితనానికీ, తనలో జీర్ణించుకున్న సహనానికీ తగిన విలువ లేనపుడు, వాటిని వదిలివెయ్యకోవడం, అర్థరహిత మనుకుంది. ఈ లోకంలో మంచి వాళ్ళకి సముచిత స్థానం లేదని కొందరంటూ వుంటారు, అందుకేనేమో...అనుకుంది, అరుణ.

ఆ రోజు సాయంత్రం ముస్తాబై భర్త రాకకోసమే యెదురుతెన్నులు చూస్తున్నట్టుగా, రాజా ఇంటికొచ్చేసరికి, యెదురుగా వెళ్ళింది. భార్య అలా యెదురుగా రావడంలో కొత్తదనం అగుపించి, ఆశ్చర్యపోయేడు, రాజా.

"తొందరగా మొహం కడుక్కొని తయారవ్వండి... సినీమాకి వెళ్దాం..." అంది, అతణ్ణి అనుసరించి లోపలికివస్తూ, అరుణ.

రాజా, విస్తుపోయాడు. తమకి వివాహమై సంవత్సరం కావస్తోంది? అరుణ యెప్పుడూ అంత చొరవగా అడగలేదు. అయినా, యిదేమంత పెద్దకోరికకాదుగదా... అనుకుని "ఇప్పుడే వచ్చేస్తాను. ఈలోగా కాఫీ తీసుకురా..." అంటూ తన గదికేసి వెళ్ళిపోయాడు, రాజా.

అరుణ కాఫీ తెచ్చేసరికి, రాజా తయారై తలదువ్వుకుంటున్నాడు. భార్య తెచ్చిన కాఫీ అందుకుని 'సిప్' చేస్తూ —

"మా అమ్మతో చెప్పావా?" అన్నాడు.

"చెప్పడం అంత అవసరమంటారా?" సూటిగా ప్రశ్నించింది, అరుణ.

మరింత ఆశ్చర్యపోయాడు, రాజా. అరుణలో హఠాత్తుగ యింతటి పరిణామం రావడానికి హేతువేమిటో, అతనికి బోధపడలేదు.

"అవసరమనికాదు అరుణా! కానీ, అది కనీసపు మర్యాద. అయినా, నీలో హఠాత్తుగ యిటువంటి ఆలోచనలు రావడం, ఆశ్చర్యంగానే వుంది సుమా."

"ఆ ఆశ్చర్యం విషయం తర్వాత ఆలోచిద్దాం... పదండి... మీరెందుకు బాధపడ్డం... అత్తయ్యతో చెప్పి వచ్చేస్తాన్లెండి." అంటూ లోపలికి వెళ్ళింది, అరుణ.

కామమాక్షమ్మ, వంటగదిలో వుండప్పటికి. "అత్తమ్మగారూ, అలా సినిమాకి వెళ్ళివస్తాం నేనూ, మీ అబ్బాయీను..." అన్జెప్పేసి, ఆమె సమాధానమైనా వినకండా వెనక్కి వచ్చేసింది.

కామాక్షమ్మ కళ్ళప్పగించి, అవాక్కయి అలా చూస్తూ వుండిపోయింది క్షణం. నిజానికి, తన కోడలు అరుణేనా యీమె?... అన్న సందేహంకూడా ఆమెకి కలిగిందంటే, ఆశ్చర్యంలేదు. వంటగదిలోంచి బైటికి వచ్చి చూసేసరికి, కొడుకూ, కోడలూ వీధిలోకి వెళ్తూండటం కన్పించింది. భారంగా నిట్టూర్పు విడిచింది. ఎంతో అమాయకురాలు, వట్టి పల్లెటూరి మేళం అనుకున్న అరుణ, ఒక్కసారి యిలా మారిందేవిటి? ఈ మార్పుకి, ఎవరైనా అదృశ్యవ్యక్తుల ప్రోద్బలం, ప్రోత్సాహం వున్నాయేమో ... వుంటే యెవరై వుంటారు? ... ఆమె వూహికి అందలేదు.

అరుణ, రాజు సినీమానించి తిరిగి వచ్చాక కలిసి భోజనం చేశారు. భోజనం చేస్తూనంత సేపూ కిలకిలనవ్వుతూ, సినీమా కబుర్లే.

వాళ్ళిద్దరూ అలా వుండటం కామాక్షమ్మకి వొంటిమీద కారం పులుముకున్నట్టుగా వుంది. ఆమె కళ్ళల్లో నిప్పులు పోసుకుంది ... మౌనంగా వుండబట్టలేకపోయింది.

"అరుణా! యేవిటా పకపకలు? తొందరగా లేవండి ..." అజమాయిషీ చెలాయించ ప్రయత్నించింది.

"అది మా స్వవిషయం లెండత్తమ్మగారూ! మీమానాన మీరు పడుకోండి" అంది అరుణ ధైర్యంగానే.

కామాక్షమ్మకి ఛెళ్ళున లెంపకాయకొట్టినట్టయ్యింది. ఆమె నోటికి తాళం పడింది. ఎందుకూ అంటే, కోడలు అలా యెదురు చెప్తుంటే, అక్కడే వున్న కొడుకు ప్రబుద్ధుడు యేమీ అనకపోవడమే!

కామాక్షమ్మ నిస్సహాయంగా వుద్రేకాన్ని అణచుకొని వెనక్కి తిరిగొచ్చి, తన మంచంమీద చేరబడింది. ఆ రాత్రంతా ఆమెకి కంటినిండా నిద్రలేదు.

* * *

మరుచటిరోజు రాజు ఆఫీసుకి వెళ్తుంటే—

"సాయంత్రం షాపింగుకి వెళ్దామండీ. కాస్త పెందరాళే రండి ..." అని చెప్పింది, అరుణ.

"అలాగే అరుణా!" అంటూ ముందుకి నడిచాడు, రాజు.

"వచ్చినప్పుడు మల్లెపూలు తీసుకురండేం!"

"అట్లాగే ..."

అరుణ మాటలు వింది, కామాక్షమ్మ. తన పెద్దరికం చేజారిపోతున్నట్లనిపించింది.

"సాయంత్రం నేనలా కామేశ్వరమ్మ గారింటికి పురాణం వినడానికి వెళ్లాలనుకుంటున్నాను అరుణా! నువ్వు షాపింగుకి వెళ్తే యెలా?" మరో ప్రయత్నం చేసింది తన ఆధిక్యత నిలబెట్టుకోవడం కోసం.

"అత్తమ్మగారూ! హాయిగా ఇంట్లో కూచుని రామాయణం చదువుకోండి.. అంతకంటె ముక్తిమార్గం యింకేముంటుంది గనుక" చిన్నగా నవ్వుతూ అంది, అరుణ.

కామాక్షమ్మ ఆశలు, మరోసారి గాల్లో కలిసి పోయాయి. మారేం మాట్లాడలేపోయింది. పరిస్థితి మరీ విషమించకూడదనుకుంది. అట్నుంచి నరుక్కురావాలనుకుంది.

సాయంత్రం కొడుకు రాంగానే, విషయం చెప్పింది. కొడుకు తనను వెనకేసుకొస్తాడనే నమ్మింది. కాని, అలా జరగలేదు.

"అరుణ చెప్పినట్టే చెయ్యకూడదమ్మా! ఏం పోయింది?" అన్నాడు, రాజా.

"అదికాదురా..." అని యింకేమో చెప్పబోయింది, కామాక్షమ్మ. రాజా అడ్డొచ్చాడు.

"అబ్బ... విసిగించకమ్మా మరి... ఈ వయస్సులో నీలాంటి వాళ్ళు హాయిగా 'రామా', 'కృష్ణ' అనుకుంటూ ఇంట్లో కూచోవడమే మంచిది కదా!"

కామాక్షమ్మ చేసిన యీ ప్రయత్నమూ వ్యర్థమయ్యింది. ఆమె మనస్సు బాగా గాయపడింది. పరిస్థితులు యింకా విషమించకముందే ఆత్మాభిమానం దెబ్బతినకముందే, తాను ఆ ఇంట్లోంచి బైటపడ్డం మంచిదేమోననిపించిందామెకి. కాని... యెక్కడికి పోతుంది?... తనకింక యెవరున్నారని? ఒకేఒక్క కొడుకు... మరోచోట తలదాచుకుందికూడా 'నా' అనే వాళ్ళింకెవరూ లేరు... ఇంక తాను చెయ్యగలిగిందేముంది! ఏదైనా అనుభవించాల్సిందే... అనుకుంది.

* * *

నాలుగు రోజులు యిట్టే గడిచిపోయాయి. కామాక్షమ్మలో సహనం సన్నిగిల్లిపోతోంది. ఆ తరుణంలో కామేశ్వరమ్మ వూడిపడింది.

"రండి పిన్నిగారూ!" ఆప్యాయంగా



## కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

## మార్పు కావాలా ?

ఆహ్వానించింది, అరుణ. "కూర్చోండి... అత్తమ్మగార్ని పిలుస్తాను..." అంటూ లోపలికి వెళ్ళి అత్తమ్మగారికి చెప్పింది అరుణ.

కామాక్షమ్మ వెళ్ళేసరికి, కామేశ్వరమ్మ కూచునేవుంది. "ఏంచేస్తున్నావే కామాక్షీ!" ప్రశ్నించింది కామేశ్వరమ్మ.

"బియ్యం బాగుచేస్తున్నాన్లే..."

"నువ్వు చెయ్యడమెందుకూ ? పనిమనిషి యేమయ్యిందేంటి ?"

"వాళ్ళు సమంగా చెయ్యరట... అందుకే నన్ను పురమాయించింది మా కోడలు." భారంగా నిట్టూరుస్తూ అంది కామాక్షమ్మ.

"ఔనూ – మొన్న పురాణ కాలక్షేపానికి నువ్వు వస్తావని యెదురుచూశాను. రాలేదేం ?"

కామాక్షమ్మకి నిజం చెప్పడం యిష్టం లేకపోయినా, చెప్పక తప్పలేదు.

"ఆ రోజు మా అబ్బాయి, కోడలు షాపింగు కెళ్ళారే... అందుకే రాలేకపోయాను."

"మీ కోడలు ముభావంగా, మంటి బుక్కడంలా వుంటుందన్నావు ... ఇప్పుడు అంత హుషారుగా భర్తతో తిరుగుతోందా యేవిటి ?"

"ఇన్నాళ్ళూ అలానే వుండేది కామేశ్వరీ! హఠాత్తుగా యిప్పుడెలా మార్పు వచ్చిందోగాని, ఆవిడతో మాట్లాడలేకపోతున్నామనుకో! పెద్దదాన్నన్న గౌరవమైనా లేకండాపోతోంది. నామీదే అధికారం చెలాయిస్తోంది. ఏం చెయ్యను ? అది నా ఖర్మ..." అని అంటున్నంతలో అరుణ రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చింది. చెరో కప్పు అందించింది.

కోడల్ని చూడగానే, కామాక్షమ్మకి చెమటలు పట్టాయి. తన మాటలు ఆమె విన్నదేమోనన్న భయం అది.

"అత్తమ్మగారూ... యేమంటున్నారు ?" మెల్లగా, సౌమ్యంగా ప్రశ్నించింది అరుణ.

కామాక్షమ్మ చేతిలోనున్న కాఫీ కప్పు ఒక్కసారి తొణికింది.

"అ...అబ్బే!... యేంలేదమ్మా... యేవీ లేదు..." అంది కంగారుగా.

ప్రేక్షకురాలిలా గమనిస్తోంది కామేశ్వరమ్మ.

"అబద్ధాలెందుకు చెబుతారు అత్తమ్మ గారూ? అంతా విన్నాన్లేను. ఈ రోజే కాదు. కొద్ది రోజుల క్రితం కూడా కామేశ్వరమ్మ పిన్నిగారితో యేం చెప్పారో కూడా విన్నాను. నా మంచితనాన్ని, నా సహనాన్ని, నా చేతగాని తనంగానూ, నన్నో మొద్దు మోహంగానూ పరిగణించారు మీరు. నేనెంతగా బాధపడ్డానో ఆ పరమాత్ముడికే తెలుసు. నాలో మార్పువస్తే, యెలాంటి అనుభూతిని పొందుతారో చవిచూపించాలని ఈ వారంరోజులూ యిలా ప్రవర్తించాను. అంతేగాని మిమ్మల్ని నొప్పించాలనికాదు ... మీమీద అధారిటీ చెలాయించాలనీ కాదు. ఇది నిజం ... మీ అబ్బాయిగారితో కూడా ఈ విషయాన్ని చెప్పాను" చిన్నగా నవ్వుతూ అంది, అరుణ.

కామాక్షమ్మ మొహం విప్పారింది. ఆమెలో యెక్కడలేని ఆనందం, వుత్సాహం ఉప్పొంగినయ్.

"అంతేనా అరుణా! ఏమో, నువ్వు మారిపోయావనుకొని, నా మనసు పరిపరి విధాల ఆలోచించింది. ఒక్కక్షణంలో నా బ్రతుకుపట్ల నాకే అసహ్యం వేసింది కూడాను" అంటూ చెప్పుకుపోయింది కామాక్షమ్మ.

"అయితే, యిప్పుడు చెప్పండి అత్తమ్మ గారూ! నాలో మార్పు కావాలంటారా ? నేనూ హుషారుగా తిరగాలంటారా ?" చిలిపిగా నవ్వుతూ అంది.

"వద్దమ్మా అరుణా, వద్దు ... నువ్వు మొదటి అరుణలానే వుండు. ఏదో నేను బ్రతికి వున్నన్నాళ్ళూ యిలా కాలం వెళ్ళబుచ్చనీ. అదే నాకు పదివేలు ... ఇంకెప్పుడూ నిన్ను కించపర్చే మాటలనని హామీ యిస్తున్నాను" అంది కామాక్షమ్మ యేకబిగిని.

కామేశ్వరమ్మ పకపకానవ్వింది. "కామాక్షీ! నేను మొదట్లోనే చెబితే విన్నావూ ? ఏవో అర్థంలేని మాటలని ఆమెని అనవసరంగా రెచ్చగొట్టావు. పుట్టింటి నుండి మెట్టినింటికి యెన్నో ఆశల్తో, యెన్నో కలలు కంటూ వస్తారు అరుణలాంటి అమ్మాయిలు. వాళ్ళని ఆప్యాయతతో, ఆదరణతో చూడ్డం మానేసి నీలాంటి కొందరు అత్తలు వాళ్ళ మనసుల్ని మార్చేసి, వారిలో జుగుప్స కలిగిస్తున్నారంటే, అతిశయోక్తి కాదేమో! వాళ్ళని తిప్పుకోవడంలోనే వుంది అత్తల ఔన్నత్యం! ఆడిపోసుకుంటే, యెప్పటికయినా అనర్థాలు తప్పవు" అంటూ అరుణకేసి తిరిగింది, కామేశ్వరమ్మ.

"మీ అత్తకి మంచి గుణపాఠం చెప్పావమ్మా! నిన్ను మారమని మరెప్పుడూ చెప్పదులే." నవ్వుకుంటూనే చెప్పింది.

అరుణకి నవ్వాగిందికాదు. బలవంతంగా ఆపుకుంది.

"వస్తానుండండి పిన్నిగారూ! అవతల వంటగదిలో పనుంది." అంటూ అక్కణ్ణించి నిష్క్రమించింది.

"హమ్మయ్యా! ఇప్పుడు నా కెంతో తృప్తిగా వుందే కామేశ్వరీ! నిజానికి గాలివాన వెలిసినట్టయినాదనుకో!" తృప్తిగా నిట్టూరుస్తూ అంది, కామాక్షమ్మ.

"కోడలిలో మార్పు రావాలని మొదట్లో కోరుకున్నావు... మరి, యిప్పుడేమంటావే ?" చిలిపిగా ప్రశ్న వేసింది, కామేశ్వరమ్మ.

"అబ్బే! ఏ మార్పూవద్దు. చెప్పానుగా, తప్పు నాదేనని... మా కోడలికేం ?... మాంచి హుషారయిన అమ్మాయి. ఎంత మంచి మనసనీ! వంటకూడా బ్రహ్మాండంగా చేస్తుందే..." ★